గురువారం 28 మే 2026

# తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 82 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

విలేకరులు కావలెను

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834



## రక్షణ రంగంలో కీలక ముందడుగు

- స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు రేసులో 3 ప్రైవేట్ దిగ్గజాలు!
- 2027 మార్చి నాటికి కాంట్రాక్ట్ ఖరారు
- మొదటి ప్రోటోటైప్ విమానం 2028 నుంచి 2032 మధ్య తొలిసారి గాల్లోకి ఎగిరే అవకాశం

# తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

- మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి
- చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి
- ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి
- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని సీఎం లేఖ
- తెలంగాణ ప్రతినిధులకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలని కోరిన సీఎం



హైదరాబాద్

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ - మిగతా3లో

## లాజిస్టిక్స్‌లో తెలంగాణ జోరు

- రేవంత్ సర్కార్ చర్యలకు కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు..
- జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్ 2025లో తెలంగాణ రాష్ట్రం 'హై పెర్ఫార్మర్'గా నిలిచి మరో కీలక మైలురాయి
- గతంలో అచీవర్ కేటగిరీలో ఉన్న తెలంగాణ.. ఈసారి మరింత మెరుగైన స్థాయికి చేరుకోవడం విశేషం.
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లాజిస్టిక్స్-2025 నివేదికలో రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, లాజిస్టిక్స్ రంగంలో తీసుకున్న చర్యలను ప్రత్యేకం




## ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి
- తమిళనాడుకు మౌలిక, సంక్షేమ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- 'సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్' (సీఏబీఎస్) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

## 'ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి'

- సీబీఎస్ఈ (ఓఎస్ఎం) వివాదంపై రాహుల్ గాంధీ ఫైర్
- ఇటీవలే రిలీజైన సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు
- కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు
- ఈ విధానం కారణంగా తమ ఆన్సర్ షీట్లు తారుమారయ్యాయన్న కొందరు స్టూడెంట్స్



# తెలంగాణలో అకాల వర్షాలు

- తడిసి ముద్దైన ధాన్యం
- రైతును నిండా ముంచిన అకాల వర్షం
- పలు కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం బస్తాలు
- ఆరబెట్టిన పంట ఆగమవడంతో లబోదిబోమంటున్న రైతులు
- చేతికొచ్చిన పంట చేజారడంతో కన్నీరుమున్నీరైన అన్నదాత





## అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి' బిల్లుకు ఆమోదం

- గిరిజనులకు మాత్రం మినహాయింపు
- అసోంలో యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) బిల్లుకు ఆమోదం
- ఇది ఓ రాజకీయ అజెండా అని కాంగ్రెస్ విమర్శ

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం కోసం

# ఇంటింటి సర్వే

- ఘనంగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు
- మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో ఆదేశాలు
- జూన్ 2 నుంచి రూ.5 లక్షలతో జీవితా బీమా పథకం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటన



హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలుకు ఇంటింటి సర్వే చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించాలని ఉపసంఘం సూచించింది. అర్హుల ఎంపిక కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. పథకం ప్రయోజనాల సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపింది. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన లోగో రూపొందించాలని నిర్ణయించింది. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ ఈ లోగోతో స్టిక్కర్లను అతికించాలని సూచించింది. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే - మిగతా3లో

## గురువారం సిద్ధరామయ్య రాజీనామా!

- మే30న కర్ణాటక కొత్త సీఎం ప్రమాణ స్వీకారం?
- గురువారం గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సిద్ధరామయ్య
- రాజీనామా చేసేందుకేనా?



## సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

- ఈ అంశంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అమలు చేయాలన్న అమిత్ షా
- సరిహద్దు జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం
- పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలి



# రక్షణ రంగంలో కీలక ముందడుగు



భారత వాయుసేన సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఐదో తరం స్వదేశీ స్టెల్త్ యుద్ధ విమానం అమ్కా అభివృద్ధిలో కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగానికే పరిమితమైన యుద్ధ విమానాల తయారీని, మోదీ ప్రభుత్వం తొలిసారిగా ప్రైవేట్ రంగానికి అప్పగించబోతోంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను పక్కన పెట్టి ప్రైవేట్ రంగానికి కేంద్రం పెద్దపీట వేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన 15 వేల కోట్ల విలువైన ఈ మెగా ప్రాజెక్ట్ రేసులో మూడు ప్రైవేట్ దిగ్గజాలు నిలిచాయి.

శత్రువుల రాడార్లకు చిక్కకుండా దాడి చేయగల అత్యంత అధునాతన స్టెల్త్ యుద్ధ విమానాన్ని సొంతంగా తయారుచేసుకునేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు దేశంలో తేజస్ వంటి ఫైటర్ జెట్లను ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మాత్రమే తయారు చేస్తూ వచ్చింది. కానీ, అమ్కా ప్రాజెక్ట్ నుంచి నాూను పక్కన పెట్టి, ప్రైవేట్ రంగానికి రక్షణ శాఖ పెద్దపీట వేసింది. మొత్తం 7 కంపెనీలు పోటీ పడగా, సాంకేతిక పరిశీలన అనంతరం మూడు ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వం షార్ట్‌లిస్ట్ చేసింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ - బెల్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్ - బిఇఎమ్ఎల్ కూటమి ఇందులో ఉన్నాయి. ఈ మూడు సంస్థలకు రక్షణ శాఖ టెండర్ పత్రాలను అందించింది. రాబోయే 2-3 నెలల్లో ఇవి తమ తుది బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2027 మార్చి నాటికి కాంట్రాక్ట్ ఎవరికి దక్కుతుందనేది ఖరారు కానుంది. ఈ ఐదో తరం యుద్ధ విమానంలో రెండు ఇంజన్లు ఉంటాయి. ఇది సింగిల్ సీటర్. అంతర్గతంగా 1500 కిలోలు, బాహ్యంగా 5,500 కిలోల ఆయుధాలను ఇది మోసుకెళ్లగలదు. ఇంధన సామర్థ్యం 6,500 కిలోలు. 55,000 అడుగుల ఎత్తులో ఇది ప్రయాణించగలదు.

**ఆంధ్రప్రదేశ్‌కు భారీ పారిశ్రామిక ప్రాధాన్యం**

ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు భారీ పారిశ్రామిక ప్రాధాన్యం దక్కబోతోంది. టెండర్ గెలుచుకున్న ప్రైవేట్ భాగస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే 650 ఎకరాల గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీలో ఈ యుద్ధ విమానాల నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు 15 వేల కోట్లతో ఈ ప్రాజెక్ట్ నడుస్తుంది. ఞ=ఞూ పరిధిలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షణలో ప్రైవేట్ సంస్థ 5 అధునాతన యుద్ధ విమాన నమూనాలను, ఒక స్ట్రక్చరల్ టెస్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇక్కడే నిర్మిస్తుంది.

**భారత వైమానిక దళానికి వెన్నుముక**

అమ్కా అనేది కేవలం ఒక యుద్ధ విమానం కాదు, భారత వైమానిక దళానికి వెన్నుముక కాబోయే అస్త్రం. శత్రువుల రాడార్ల కళ్లు కప్పి లోపలికి దూసుకెళ్లేలా దీనికి ప్రత్యేక 'స్టెల్త్ కోటింగ్, ఆయుధాలు లోపలే దాగి ఉండేలా అమరుస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కేవలం అమెరికా, చైనా, రష్యా వద్ద మాత్రమే ఇటువంటి ఐదో తరం యుద్ధ విమానాలు ఉన్నాయి. ాూవీజూా విజయవంతమైతే, ఈ అగ్రరాజ్యాల సరసన భారత్ సగర్వంగా నిలబడుతుంది. విదేశాలపై ఆధారపడటం పూర్తిగా తగ్గుతుంది. ఐదో తరం యుద్ధ విమానాల తయారీ అత్యంత సంక్లిష్టమైనది. ఇందుకోసం సుదీర్ఘ సమయం పడుతుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం మొదటి ప్రోటోటైప్ విమానం 2028 నుంచి 2032 మధ్య తొలిసారి గాల్లోకి ఎగిరే అవకాశం ఉంది. అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకుని, 2035 నాటికి ఇది భారత వైమానిక దళంలో పూర్తిస్థాయిలో చేరనుంది. ప్రైవేట్ భాగస్వామ్యం వల్ల ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని రక్షణ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ సవాల్‌లను ఎదుర్కొనేందుకు, అలాగే రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధించేందుకు అమ్కా ప్రాజెక్ట్ భారత్‌కు ఒక గేమ్ ఛేంజర్ కాబోతోంది.

# ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ



తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ బుధవారం ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రధానిని కలవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా 'మేకెదాటు డ్యామ్' ప్రాజెక్టు, తమిళ మత్స్యకారుల అరెస్టుల గురించి విజయ్ మోదీతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా అనైమంగళం రాగి శాసనాలను తిరిగి భారత్‌కు తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి విజయ్ కృతజ్ఞతలు తెలియజేశారు. దీనితోపాటు తమిళనాడు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో సంప్రదాయకంగా రాష్ట్ర ప్రార్థన గీతం 'తమిళ తాయ్ వాళ్తు' పాడడం ఆనవాయితీగా వస్తోందని సీఎం విజయ్ ప్రధానికి వివరించారు. అయితే ఈ ఏడాది జనవరిలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఒక సర్క్యులర్ తర్వాత, ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని ముందుగా పాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో ఎప్పటిలానే రాష్ట్ర ప్రార్థన గీతాన్ని పాడడానికి అనుమతిస్తూ తగిన వివరణ ఇవ్వాలని కేంద్ర హోంశాఖను ఆదేశించాలని విజయ్ ప్రధానిని కోరారు.

తమిళనాడులో 'సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్' (సీఏబీఎస్) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కూడా విజయ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, అలాగే సీఏబీఎస్ ఏర్పాటు చేయడంపై గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)తో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

కర్ణాటక డ్యామ్‌కు అనుమతి ఇవ్వొద్దు

కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన 'మేకెదాటు డ్యామ్'?' ప్రాజెక్టు గురించి కూడా ప్రధాని మోదీతో విజయ్? మాట్లాడారు. 'ఈ మేకెదాటు ప్రాజెక్టు కోసం భూమి పూజ చేస్తామని కర్ణాటక ఉపముఖ్యమంత్రి ప్రకటన చేశారు. కావేరీ నీటి వివాదాల ట్రిబ్యునల్? ఇచ్చిన తుది తీర్పునకు, సుప్రీంకోర్టు ఆదేశాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని విజయ్ పేర్కొన్నారు. కర్ణాటక తలపెట్టిన ప్రాజెక్టు వల్ల తమిళనాడు రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఆయన చెప్పారు. కావేరీ నదీ పరీవాహక ప్రాంతాలుగా ఉన్న తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అనుమతి లేకుండా ఈ మేకెదాటు ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖను, సెంట్రల్? వాటర్ కమిషన్?ను ఆదేశించాలని మోదీని విజయ్ కోరారు.

శ్రీలంక నౌకాదళం తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేయడం, వేధించడం లాంటి ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతుండడంపై సీఎం విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఈ 2026 సంవత్సరంలోనే ఇలాంటి అరెస్టులు 12 సార్లు జరిగాయన్నారు. ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక జైళ్లలోనే ఉన్నారని, అలాగే 266 ఫిషింగ్ బోట్లను శ్రీలంక స్వాధీనం చేసుకుందని ఆయన వివరించారు. మన మత్స్యకారులను, వారి బోట్లను వెంటనే విడుదల చేసేలా శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రధానిని కోరారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి విజయ్?, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?ను మర్యాదపూర్వకంగా కలిశారు. హస్తిన పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్? షాతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోనూ సమావేశమయ్యే అవకాశం ఉందని సమాచారం.

# అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి' బిల్లుకు ఆమోదం



అసోం అసెంబ్లీ బుధవారం 'ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బిల్లు'ను ఆమోదించింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలన కోసం పంపాలని విపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలపై అందరికీ ఒకే రకమైన చట్టాలను తీసుకురావాలనే లక్ష్యంతో అసోం ప్రభుత్వం సోమవారం ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా బహుభార్యత్వాన్ని నిషేధించాలని, సహజీవనం రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ బిల్లు అసోంలో నివసించే ఏ షెడ్యూల్ తెగలకు (ఎస్టీ)లకు వర్తించదు. యూసీసీ ప్రకారం, ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకుంటే ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. సహజీవనం చేసే జంటలు తమ బంధాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే 3 నెలల జైలు శిక్ష విధిస్తారు.

**జవహర్‌లాల్ నెహ్రూనే యూసీసీ కావాలన్నారు**

ఈ బిల్లు ఆమోదం పొందడానికి కొద్ది సేపటి ముందు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 1925లోనే పౌర ఉమ్మడి స్మృతిని మొదటిసారి సమర్థించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ (లౌకిక) పార్టీగా లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికి ప్రతినిధిగా మారిపోయిందని ఆరోపించారు.

ఇకపై అసెంబ్లీలో 'ది యూనిఫామ్ సివిల్? కోడ్, అసోం, 2026'పై అడిగిన ప్రశ్నలకు సీఎం హిమంత బిశ్వ శర్మ సమాధానం ఇస్తూ, "ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఈ చట్టం బీజేపీ లేదా ఆర్?ఎస్?ఎస్? సిద్ధాంతాలపై ఆధారపడి లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 44 ఆధారంగానే రూపొందించాం. వాస్తవానికి యూసీసీకి పెద్ద చరిత్రే ఉంది. దీనిని 1925లో మొదటిసారి కాంగ్రెస్ పార్టీయే డిమాండ్ చేసింది. 1937లో స్వయంగా జవహర్?లాల్ నెహ్రూ దీనిని ప్రవేశపెట్టాలని సూచించారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు యూసీసీని హిందూ, క్రైస్తవ, గిరిజనుల కోణం నుంచి కాకుండా ఖురాన్?, షరియా కోణం ద్వారా చూస్తూ వ్యతిరేకిస్తోంది" అని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్? పార్టీని విమర్శిస్తూ హిమంత కీలక వ్యాఖ్యలు చేశారు. "అసెంబ్లీలో కాంగ్రెస్? వారి ఎమ్మెల్యేల కూర్పు చేస్తేనే వారు అన్ని కులాలు, మతాలు, వర్గాలకు ప్రాతినిధ్యం వహించడం లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారని అర్థం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ అసోంకు ప్రాతినిధ్యం వహించడం లేదు. 126 మంది సభ్యులున్న అసోం అసెంబ్లీలో కాంగ్రెస్?కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో 18 మంది ముస్లిం సమాజానికి చెందినవారు కాగా, ఒక్కరు మాత్రమే హిందువు" అని విమర్శించారు.

**అసోం ప్రజలకు అభినందనలు**

యూసీసీ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్?షా ఎక్స్? వేదికగా, అసోం ప్రజలకు అభినందనలు తెలిపారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పౌరుడి కోసం ఒకే విధమైన చట్టాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఉత్తరాఖండ్?, గుజరాత్? తర్వాత అసోం కూడా ఈ రోజు ఉమ్మడి పౌర స్మృతి బిల్లును ఆమోదించడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.

**ఇది బీజేపీ రాజకీయ ఎజెండా**

అంతకుముందు, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు యూసీసీ బిల్లును తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లులను బీజేపీ రాజకీయ ఎజెండా అని కొట్టిపారేశారు. ఈ బిల్లుపై ప్రజలతో పెద్ద ఎత్తున చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఈ ఉమ్మడి పౌర స్మృతి బిల్లు వల్ల మైనారిటీ మత వర్గాల హక్కులు భంగం వాటిల్లుతుందేమోనని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. "యూనిసీలో పేర్కొన్న విషయాలన్నీ ఇప్పటికే వేర్వేరు చట్టాల రూపంలో అమలులో ఉన్నాయి. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, పెళ్లిళ్లు-విడాకుల రిజిస్ట్రేషన్?, భరణం వంటి విషయాలన్నీ మన ప్రస్తుత చట్టాల పరిధిలో ఉన్నాయి. మరి అలాంటప్పుడు మళ్లీ యూసీసీ తీసుకురావడంలో అర్థం ఏమిటి? బీజేపీ కేవలం రాజకీయాలు చేయడానికే ఈ బిల్లును తీసుకొచ్చింది. ఇలా పౌరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. గిరిజనులను మినహాయించినప్పుడు ఈ చట్టాన్ని యూనిఫామ్? (అందరికీ సమానమైనది) అని ఎలా పిలుస్తారు?" అని కాంగ్రెస్? ఎమ్మెల్యే వాజెద్ అలీ చౌదరి ప్రశ్నించారు. నిరుద్యోగం, వరదల సమస్య, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి హిమంత ప్రభుత్వం ఈ యూసీసీ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని వాజెద్ అలీ చౌదరి ఆరోపించారు. అయితే ప్రభుత్వం మాత్రం మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలకు అన్నింటికీ ఒకే రకమైన చట్టాలను అమలు చేయాలనేదే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే జాకీర్ హుస్సేన్ సిక్దర్ మాట్లాడుతూ, 2018 నాటి లా కమిషన్ కూడా ఈ బిల్లును పాస్ చేయడానికి అభ్యంతరం పెట్టిందని గుర్తు చేశారు. ఇక అసోం అసెంబ్లీలోని ఏకైక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే షెరుల్ అలీ అహ్మద్? ఈ బిల్లులోని నిబంధనలను వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం దురుద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు.

## సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్-పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

**'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'**

అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

**360-డిగ్రీల భద్రతా కవచానికి ఏర్పాటు**

ప్రతి సరిహద్దు జిల్లాకు పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360-డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్? షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్? షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశాలపై రెండు నెలల తర్వాత తిరిగి సమీక్ష, అభిప్రాయ సేకరణ చేపడతారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలు ఫలిత ఆధారిత చర్యలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సీడీసీ) ఏర్పాటు చేసింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలోగా తన నివేదికను సమర్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాయింట్ సెక్రటరీ (విదేశీయులు-1) ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని అమిత్? షా చెప్పారు.

## గురువారం సిద్ధరామయ్య రాజీనామా!

కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్ధరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్ధరామయ్య తన అధికారిక నివాసం 'కావేరీ'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్ధరామయ్యచెప్పారు.

**విడివిడిగా కలిసిన నేతలు**

ఢిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్ధరామయ్యను అధిష్టానం కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాబోయే ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు.

## 'ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి'

సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో నిండిపోయాయని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీసేందుకు స్వతంత్రంగా న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోయింట్స్‌కు సీబీఎస్ఈ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించారు. కోయింట్స్ యాజమాన్యానికి, ప్రధాని మోదీ ప్రభుత్వానికి మధ్య ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. కాగా, సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. దీంతో తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**'విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు'**

మూల్యాంకన వ్యవస్థలో జరిగిన అవకతవకల కారణంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వివాదం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఉద్దేశపూర్వక కుట్రను సూచిస్తోందని అన్నారు. మూల్యాంకన వ్యవస్థకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "సీబీఎస్ఈ ఫలితాల స్కామ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇది మోదీజీ వినయానికొస్తే? ఎప్పటిలాగే ఈ విషయంపై ఆయన దగ్గర సమాధానాలు లేవు. జవాబుదారీతనం లేదు." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల నిర్వహణ బాధ్యత అప్పగించిన కోయింట్స్ సంస్థ గతంలో 2019లో తెలంగాణలో గ్లోబరేనా పేరుతో పనిచేస్తూ ఇలాంటి దుశ్చర్యలకే పాల్పడింది. పేరు మారినా ఆ సంస్థ ఉద్దేశం, స్వభావం మారలేదు. ఆ సంస్థ చరిత్ర బహిరంగంగానే ఉన్నప్పటికీ, లెక్కచేయకుండా సీబీఎస్ఈ కాంట్రాక్టును దానికి అప్పగించారు. 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అలాంటి సంస్థకు అప్పగించారు. ఇది పొరపాటు కాదు.

# లాజిస్టిక్స్‌లో తెలంగాణ జోరు..




**హైదరాబాద్:** లాజిస్టిక్స్ రంగంలో తెలంగాణ మరో కీలక మైలురాయిని చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించి హై పెర్ఫార్మర్‌గా నిలిచింది. గతంలో అచీవర్ కేటగిరీలో ఉన్న తెలంగాణ, ఈసారి మరింత మెరుగైన స్థాయికి చేరుకోవడం విశేషంగా మారింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లీడ్స్-2025 నివేదికలో తెలంగాణ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, వేగవంతమైన నిర్ణయాలే ఈ ఫలితానికి కారణమని అధికారులు భావిస్తున్నారు.

దేశంలోని పలు రాష్ట్రాల మధ్య పోటీలో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంది. హర్యానా, ఛత్తీస్‌గఢ్, బిహార్ వంటి రాష్ట్రాలతో సమానంగా నిలవడంతో పాటు మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచినట్లు నివేదిక వెల్లడించింది. ప్రత్యేకంగా జలమార్గాల వినియోగంపై తెలంగాణ చూపుతున్న దృష్టిని కేంద్రం ప్రశంసించింది. గోదావరి, కృష్ణా, భీమా, మంజీరా, తుంగభద్ర వంటి జాతీయ జలమార్గాలను సరకు రవాణాకు ఉపయోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నివేదికలో ప్రస్తావించారు. పారిశ్రామిక పార్కుల్లో కనీసం ఐదు ఎకరాలను లాజిస్టిక్స్ మౌలిక వసతులకు కేటాయించే విధానాన్ని కూడా కేంద్రం ప్రశంసించింది. పరిశ్రమల అభివృద్ధితో పాటు రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక నిర్ణయంగా గుర్తించింది.

**యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీకి కేంద్రం ప్రశంసలు**

ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ చేపడుతున్న చర్యలు కూడా కేంద్ర దృష్టిని ఆకర్షించాయి. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్ ద్వారా పరిశ్రమలకు అనుసంధానమైన కోర్సులు ప్రారంభించి యువతకు శిక్షణ అందిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. మొదటి ఏడాదిలోనే 500 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం రాష్ట్ర దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణించింది.

వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ సేవలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ముందుకు వెళ్తున్నాయి. ఇక నల్లగొండ జిల్లా చిట్యాలలో రూ.750 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్, మెదక్ జిల్లాలో ప్రతిపాదించిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్, నిజామాబాద్‌లో ఐసీడీ ప్రాజెక్ట్ వంటి పలు కార్యక్రమాలు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి మరింత బలం చేకూర్చనున్నాయి.

రవాణా రంగం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకెళ్తోందని తాజా నివేదిక మరోసారి స్పష్టం చేసింది.

# తెలంగాణలో అకాల వర్షాలు



తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసి నీటిపాలయ్యింది. కన్న బిడ్డలా కాపాడుకున్న పంట అమ్మకం కోసం నిరీక్షిస్తున్న రైతుకు చివరాఖరికి కన్నీరే మిగిలింది. సిద్దిపేట జిల్లాలో అకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మండలాల్లో అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షం అన్నదాతల గుండెల్లో గుబులు రేపింది. ఆయా మండలాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యపు రాశులు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన ధాన్యపు సంచులు సైతం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా మార్కెట్ యార్డులు, రహదారులపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు మండలం బండతిమ్మపూర్ లో భారీ వర్షానికి ధాన్యం, పశుసంపద నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందారు. నర్సాపూర్ నియోజకవర్గం, పాపన్న పేట మండలంలోని కొనుగోలు కేంద్రాలు జలమయమై చెరువులను తలపించాయి. సంగారెడ్డి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వేల ధాన్యపు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో వడ్లు తూకం వేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులకు తీవ్ర నష్టం**

అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. చొప్పదండి, రామ డుగు, గంగాధర, మానకొండూరు మండలాల్లో వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిముద్దైంది. నెల రోజులుగా విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మార్కెట్లో అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న, ధాన్యం తడిచిపోయింది. వర్షానికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి పోసిన మక్కలు, వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కుండపోత వర్షం కురవడంతో వరి ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి.. కొంత ధాన్యం కొట్టుకుపోగా, మక్కల బస్తాలు సైతం తడిసిపోయాయి. మార్క్ ఫెడ్ ద్వారా నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించగా నేటికీ మక్కలను కొనలేదని అందుకే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దైన ధాన్యం : కామారెడ్డి జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద అరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. మాచారెడ్డి, కామారెడ్డి, బిక్కనూర్, దోమకొండ, బీబీపేట్ మండలాలతోపాటు రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివ నగర్ మండలాల్లో సైతం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. హమాలీల కొరత, అధికారుల అలసత్వంతో కాంటా ఆలస్యం కావడంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇలాంటి నష్టం జరిగేది కాదని వాపోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మార్కెట్‌లో ఆరబెట్టి సంచుల్లో నింపిన మట్నక్కజొన్న, ధాన్యం తడిసిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు పడుతున్న ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ : రెండు మూడు వారాలుగా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనకుండా ఇప్పుడు నష్టాలపాలు చేశారని రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.జ

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్ - ముగిసిన తొలిరోజు విచారణ

పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్?పై నమోదైన పోక్సో (ౄజూౠ) కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉంది. మంగళవారం బండి భగీరథ్‌ని 3 రోజులపాటు పోలీసు కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. బుధవారం పోలీసులు భగీరథ్‌ని కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి పెట్‌బషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అనంతరం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లారు.

**ముగిసిన బండి భగీరథ్ విచారణ**

అరణ్య ఫామ్‌హౌస్?లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం బండి భగీరథ్‌నుకూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు భగీరథ్‌ను విచారించారు. అనంతరం పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు బండి భగీరథ్‌ను తరలించారు. మరో రెండు రోజులు భగీరథ్‌ని విచారించాల్సి ఉంది. 7 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరినా, కోర్డు కేవలం 3 రోజులపాటు మాత్రమే కస్టడీకి అనుమతి ఇచ్చింది.

**అసలేం జరిగింది :** 2025 జూన్‌లో కామన్ ఫ్రెండ్స్ ద్వారా సదరు మైనర్ బాలికకు బండి భగీరథ్‌తో పరిచయం ఏర్పడిందని, అక్టోబర్, డిసెంబర్ 2025 మధ్య కాలంలో భగీరథ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, మద్యం సేవించాలని ఒత్తిడి చేశాడని బాధిత మైనర్ బాలిక ఆరోపించింది. మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో)తో పాటు, తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని కఠినమైన సెక్షన్లను పోలీసులు ఈ కేసులో చేర్చారు.



**14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ :** మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు బాధితురాలితో పాటు ఆమె తల్లి వాంగ్మూలాలను నమోదు చేశారు. పోలీసులు మరికొన్ని సెక్షన్లు యాడ్ చేశారు. అనంతరం నాటకీయ పరిణామాల మధ్య బండి భగీరథ్?ను పోలీసులు అరెస్టు చేశారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో బండి భగీరథ్ చర్లపల్లి జైలుకు తరలించారు.

**పోలీస్ కస్టడీ**

ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, సమాచారాన్ని రాబట్టేందుకు నిందితుడు భగీరథ్?ని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఇతర వివరాలు ఈ కేసులో దర్యాప్తు చట్ట ప్రకారం జరుగుతోందని, తాము విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామని భగీరథ్ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

**ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు**

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కేసులు భగీరథ్‌కు మద్దతుగా, మైనర్ బాలికి ఫోటోలు, వీడియోలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే కేసును తప్పుదోవ పట్టించేలా వీడియోలు, ఫోటోలు వైరల్ చేశారనే ఆరోపణలపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం కోసం ఇంటింటి సర్వే

-మొదటిపేజీ తరువాయి

సమర్పించాలని కోరింది. మంగళవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ మంత్రులు ఉత్తమ్?కుమార్?రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్?బాబు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల వివరాలను ఉపసంఘం సమీక్షించింది. ఈ మేరకు భట్టి మాట్లాడుతూ ఇంటింటి సర్వేతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలు చేయాలి. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 90 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అయింది. ఈ కార్యక్రమ ముగింపు వేడుకలను జూన్? 2 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహించాలి. రాబోయే రోజుల్లో ప్రజాభాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి అని చెప్పారు.

సమావేశంలో జూన్ 2 నుంచి 12 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై మంత్రులు చర్చించారు. రోడ్డు భద్రత, పర్యావరణ వారోత్సవం, మాదవ ద్రవ్యాలపై వ్యతిరేక ప్రచారం, గృహ నిర్మాణం, మహిళ-శిశు రక్షణ, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనలు, హరిత ఇంధన ప్రాజెక్టులు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశం చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా, అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

**జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం**

ప్రతి కుటుంబానికి బీమా రూపంలో భద్రత కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జూన్? 2 నుంచి ప్రవేశ పెట్టనుంది. గతంలో తెలంగాణ ప్రభుత్వ వార్షిక బడ్జెట్?లో కీలక ప్రకటన చేసింది. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవితా బీమా పథకం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. సగటు కుటుంబంలో నలుగురు సభ్యులు ఉండటం సహజం. కానీ అందులో ఒక్కరికే జీవిత బీమా పాలసీ ఉంటే దాని క్లెయిమ్? ద్వారా కుటుంబం మొత్తానికి భరోసా లభిస్తుందా? అనేది చాలా మందికి ఉండే సందేహం. అయితే ఎలాంటి సమస్య రాకుండా ఉండేందుకు ఒకటికంటే ఎక్కువ పాలసీలు తీసుకోవచ్చా? తీసుకుంటే వాటి నిర్వహణ ఎలా ఉండాలి అనే విషయంలో నిపుణులు సూచనలు మీ కోసం.

**రెండు పాలసీలు వర్తిస్తాయా?**

వయసు పెరిగే కొద్దీ బాధ్యతలు పెరుగుతాయి. ఒక వ్యక్తికి 30 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు పరిమిత హామీ మొత్తంలో కూడిన ఒక జీవిత బీమా పాలసీ సరిపోవచ్చు. అదే వ్యక్తి 50 సంవత్సరాల వయసుకు చేరేసరికి కుటుంబానికి మూలధారం కావచ్చు. సాధారణంగా చిన్న కుటుంబాలలో నలుగురు సభ్యులుంటారు. వీరితో పాటు సీనియర్? సిటిజన్లు అయిన తల్లిదండ్రులను బాధ్యతలు చూడాలి. అలాంటప్పుడు ఉన్న బీమా పాలసీ అదనపు ఖర్చులకు సరిపోతుందా కుటుంబ ఆర్థిక రక్షణకు, కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చేందుకు ఒక పాలసీ సరిపోదనుకుంటే అవసరానికి తగినట్లు సమయానుసారం అదనపు పాలసీలను కొనుగోలు చేయవచ్చా ఒకవేళ కొనుగోలు చేస్తే పాలసీలన్నింటిని ఎలా నిర్వహించాలి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ జీవిత బీమా పాలసీలను క్లెయిమ్ చేసుకోవడం సాధ్యమే. ఇది పాలసీదారుడు బీమా అవసరాలు, ఏ ప్లాన్? కొనుగోలు చేశారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. అదే విధంగా పాలసీదారులకు ఎంత వరకు బీమా అందించవచ్చు అనే విషయమై బీమా సంస్థలకు కూడా నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయి. పాలసీ కొనుగోలు చేసిన వ్యక్తి ఆదాయం, వయసు, ప్రీమియం చెల్లింపులు సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంత మొత్తం హామీగా ఇవ్వచ్చు అనేది బీమా సంస్థలు నిర్ణయిస్తాయి. ఏదేమైన ఒక వ్యక్తి రెండో పాలసీ కొనుగోలు చేయాలనుకుంటే, రెండు పాలసీల గురించి బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. అంతేకాదు ఈ విధంగా రెండో జీవిత బీమా పాలసీని ఎందుకు ఎంచుకుంటున్నారో పేర్కొనాలి.

## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు.

**తెలంగాణకు నీళ్లొస్తాయి**

తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

**కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

## వాహన్ తిప్పలు.. దళారుల రాజ్యం

**హైదరాబాద్ :** 'రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా డిజిటల్ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రీకృత 'వాహన్' పోర్టల్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు సకాలంలో అందకపోవడంతో సామాన్యులు విసిగిపోతున్నారు. ఇదే తరుణాన్ని ఆసరాగా చేసుకుని దళారులు (ఏజెంట్లు) వేలల్లో డబ్బులు తీసుకుంటూ సామాన్యులను దోచుకుంటున్నారు. లర్నింగ్ లైసెన్స్ (ఒఒఖీ), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ (రెక్టిఫికేషన్/రిన్యూవల్), చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ వంటి విభిన్న రకాల సేవల కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల ఈ విధానంలోకి మారినప్పటికీ, అప్పటి నుంచి సాంకేతిక లోపాలు నిత్యకృత్యంగా మారాయి. గతంలో నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు అరగంట దాటినా కావడం లేదు. ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మొబైల్ నంబర్ ఆథెంటికేషన్ కావడం లేదు. సరైన సైజులో ఫోటోలు, సంతకం, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ వెబ్‌సైట్‌లో లోపాలు తలెత్తుతున్నాయి. సొంతంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే వెబ్‌సైట్ పనిచేయకపోవడం, అదే రవాణా కార్యాలయాల్లోని ఏజెంట్లను ఆశ్రయిస్తే వెంటనే స్లాట్ బుకింగ్ అయిపోతుండటం గమనార్హం. వెబ్‌సైట్‌లో ప్రతి సేవకు ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ రుసుము ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దళారులు చెప్పిందే వేదంగా మారుతోంది. ఆన్‌లైన్ ఫీజుతో సంబంధం లేకుండా ఒక్కో సేవకు ఒక్కో రకమైన ధర నిర్ణయించి వాహనదారుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నారు. "నా కుమారుడికి లైసెన్స్ కోసం సొంతంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేయడానికి ఎంత ప్రయత్నించినా కాలేదు. కానీ స్థానిక ఆర్టీఓ ఆఫీసులో ఒక ఏజెంట్‌ను సంప్రదించగానే వెంటనే స్లాట్ బుక్ అయింది. ఇందుకోసం అతనికి రూ. 3 వేలు ఇవ్వాల్సి వచ్చింది. రవాణా శాఖ ఆఫీసుల చుట్టూ తిరగకుండా సొంతంగా చేసుకోవచ్చని చెబుతున్నా, ఆచరణలో మాత్రం దళారులను ఆశ్రయించనిదే పని కావడం లేదు అని"ఆసిఫ్ నగర్‌కు చెందిన ఒక వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు లేవని రవాణా శాఖ అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జాతీయ సంస్థ 'ఎన్ఐసీ' (ఔఎఅ) నుంచి అవసరమైన టెక్నికల్ సపోర్ట్ తీసుకుంటున్నామని, 'వాహన్' పోర్టల్‌లో మరిన్ని కొత్త మాడ్యూళ్లను దశలవారీగా ప్రవేశపెడతామని అధికారులు పేర్కొంటున్నా

# కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

**జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతిను కలిసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య**



**న్యూఢిల్లి :** కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి.× కేంద్రం బడ్జెట్ లో బీసీల అభివృద్ధికి రెండు లక్షల కోట్లకు పెంచాలి.× ఆంధ్రప్రదేశ్ ? తెలంగాణ మాదిరిగా హాస్టళ్ళు ? గురుకుల పాఠశాలల పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ పథకం దేశమంతటా అమలు చెయ్యాలని రాజ్యాంగ బద్దమైన సంస్థగా సిఫార్స్ చెయ్యాలి. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ బద్ధమైన సంస్థగా జాతీయ బి.సి కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పలువురు బి సి సంఘం నేతలతో కలిసి జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతిను ఢిల్లీలో లో కలిసి చర్చలు జరిపారు. స్వాతంత్ర వచ్చి 77 సంవత్సరాలు గడిచిన 56% జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం ఈ కులాల అభివృద్ధి జరగడం లేదు అన్నీ సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లు యున్నవి. కానీ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం వలన న్యాయం జరుగుతుంది అని తెలిపారు . కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు పెట్టారు వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలు స్కాలర్ షిప్ లు, ఫీజు రియంబర్స్ స్కీము మంజూరు, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదు. ప్రత్యేక హాస్టళ్ళు ? విద్యా సంస్థలు లేకపోతే బి.సి లు ఎలా చదువుకుంటారని తెలిపారు. విద్యా సంబంధమైన రాయితీలు స్కాలర్ షిప్ లు ? ఫీజులు, హాస్టళ్ళు లేకపోతే ఆర్థికంగా అత్యంత వెనుక బడిన కులాలు ఎలా చదువుకుంటారని సాధ్వి నిరంజన్ జ్యోతికి తెలిపారు. ఐ.ఐ.టి - ఐ.ఐ.యం - నీట్ లాంటి ముఖ్యమైన కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు ఈ కోర్సుల ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నవి. ఒక లక్షా 30 వేల నుండి ఒక లక్షా 70 వేల వరకు ఫీజులు ఉన్నవి. పైగా బీసీలకు క్రిమిలేయర్ ఆర్థిక పరిమితి విధించారు అత్యంత వెనకబడిన కులాల వారు సీట్లు పొందినప్పటికీ ఫీజు కట్టే సోమత లేక చదువు మానుకుంటున్నారని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలు. విద్యా రంగంకు అత్యంత ప్రాదాన్యత ఇచ్చి ఉచిత విద్యా 3వ తరగతి నుండి పి.జి వరకు ఇస్తున్నారు. ముఖ్యంగా 6వేల హాస్టళ్ళు, 1500 గురుకుల పాఠశాలలో 24 లక్షల మందికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. అలాగే 30 లక్షల మందికి కాలేజీ విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ అమలు చేస్తున్నారు.విద్యకు అత్యంత ప్రాదాన్యత ఇస్తున్నారు.విద్య వలన జ్ఞాన సమాజం ఏర్పడుతుంది. సమాజంలో ప్రతి పౌరుడు సభ్యతతో - సంస్కారవంతంగా జీవిస్తారు. దీని మూలంగా సమాజంలో శాంతియుతంగా ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తారు. ఆరోగ్య స్పృహ ఎక్కువగా వస్తుంది. దీని మూలంగా ప్రభుత్వం వైద్య, ఆరోగ్యం పై పెట్టె బడ్జెట్ ఖర్చు తగ్గుతుంది. అలాగే శాంతిభద్రతలు కూడా చక్కగా ఉండడంతో పోలీసు శాఖపై పెట్టె ఖర్చు కూడా తగ్గుతుంది. ఇలా ఒకదాని పై ఒకటి ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి.విద్య ద్వారానే మనుషులలో నైతిక, సామాజిక, మానవ విలువలు పెరుగుతాయి. అప్పుడే సమాజం సజావుగా కొనసాగుతుంది. సమాజంలో కనిపిస్తున్న అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు విద్య ద్వారానే నిర్మించగలరు. సమాజంలో ఉన్న దోపిడీ, పీడన, వివక్ష, అసమానతలు, అణచివేతలకు విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుంది, అజ్ఞానం అమాయకత్వం, విద్య ద్వారానే నిర్మించగలరు. భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్య లకు విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుంది. రాకెట్ స్పీడ్ తో తెలుగుతున్న ఆధునిక విజ్ఞాన ప్రపంచంలో విద్య ద్వారానే భారత్ పోటీని ఇవ్వగలుగుతుంది. భవిష్యత్తులో మానవ మనుగడకు ఎదురవుతున్న సవాళ్లను, వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ విద్య ద్వారానే జాతిని జాగృతం చేయగలుగుతాం. ఒక వ్యక్తి నిర్మాణం ? కుటుంబ నిర్మాణం ? సమాజ నిర్మాణం విద్య ద్వారానే జరుగుతుంది.విద్య ఒక్కటే మానవ వికాసానికి మార్గం. విద్య ద్వారానే బడుగు వర్గాలకు సాంఘిక సమానత్వం - సామాజిక న్యాయం దక్కుతుంది. ప్రపంచంలో నేడు అగ్రదేశాలుగా చలామణి అవుతున్న అమెరికా, ఇంగ్లాండ్, చైనా, జపాన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ 100% విద్య వలనే అగ్రదేశాలుగా గుర్తించబడ్డాయి. విద్యా ద్వారానే భారతదేశంలోనే శక్తి వంతమైన దేశంగా రూపొందుతుంది. పరిశ్రమలు రావడం, యాంత్రీకరణ చెందడం మూలంగా కులవృత్తులు - చేతివృత్తులు దెబ్బతిన్నాయి. దీనితో ఈ కుల వృత్తుల వారు వృత్తులు కోల్పోయి ఆకలి చావులకు గురవుతున్నారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాజీవ్ ఫెలో షిప్ పథకం కింద అర్హులైన ఖ్వఆ స్కాలర్స్ అందరికీ స్టై ఫండు మంజూరు చేయాలని, గురుకులపాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని సాధ్వి నిరంజన్ జ్యోతిను కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు.కేంద్రానికి సిఫార్సు చేస్తామని హామీ :బీసీల డిమాండ్లు న్యాయమైనవని ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారు . తెలుగు రాష్ట్రాలు అమలు చేస్తున్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు దేశమంతటా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని సాధ్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారు.

# మహిళా ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**వనపర్తి :** మహిళా ఆర్థిక స్వావలంబనే పరమావధిగా... తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమైక్య ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు.ముందుగా మహిళా సమాఖ్య భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్ను ఆయన ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూదివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో మహిళలకు భావన వంతిపై రుణాలు ఇచ్చారని.నేడు రేవంత్ రెడ్డి పాలనలో మహిళలను మహారాణులుగా చేయాలన్న ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి సంతకం మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసే ఫైల్ పైనే సంతకం చేశారని ఆయన గుర్తు చేశారు.ఈ ఉచిత ప్రయాణం ద్వారా కేవలం వనపర్తి నియోజకవర్గం సంబంధించి ఇప్పటివరకు 30 కోట్ల 32 లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించిందని ఆయన వివరించారు. 1996లో మహిళా సంఘాలు ఏర్పాటు అయ్యాయని అప్పుడు కేవలం 10 వేల రూపాయలు మాత్రమే మహిళా సంఘాలకు రుణంగా ఇచ్చేవారని నేడు 20 లక్షల రూపాయలు మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రుణం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళా సంఘాలకు ప్రత్యేక గ్రామంలో మహిళా సంఘం భవనం ఉండేలా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 12,700 మహిళా సంఘం భవన నిర్మాణాలను చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.కేవలం వనపర్తి నియోజకవర్గంలో 104 మహిళా సంఘం భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళా సంఘంలోని మహిళలకు 10 లక్షల బీమా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఇప్పటివరకు 6000 సంఘాలకు 324 కోట్ల రూపాయల రుణాలు ఇచ్చినట్లు వారి తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్ర చిన్నారులకు మంజూరైన యూనిఫారం లను చిన్నారులకు అందజేశారు. నిరవధిక నిరసనలు చేపట్టిన వివో ఏలు జూన్ రెండో తారీకు వరకు సమయమైన పాటించాలని జూన్ రెండు తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం డిఆర్డిఏ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. వారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతైనా సహాయ సహకారాలు అందిస్తుందని స్వయం సహాయ కోత్తలపై వృత్తి సారించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఇందిర, మండల సమాఖ్యఅధ్యక్షురాలు సంధ్యారాణి.బి డబ్ల్యు ఓ సుధారాణి, పట్టణ కౌన్సిలర్లు, ఐఖఓ లు, అఆ లు, ఎాఎ లు, అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.









## ఆఫీస్ బేరర్స్ బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలి టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు యశ్వంత్



ఇబ్రహీంపట్నం,(తెలంగాణ గీతం )మే 27: ఉద్యోగ బదిలీల్లో ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్కు మినహాయింపు కల్పించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఊటు యశ్వంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్??మహన్, జిల్లా వైద్యాధికారి స్వర్ణకుమారికి టీఎన్జీవోస్ నాయకులతో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం ఉద్యోగ సంఘాల్లో బాధ్యతలు నిర్వ హిస్తున్న ఆఫీస్ బేరర్స్ బదిలీల్లో మినహా యింపు వర్తింపజేయాలని కోరారు. కార్యక్ర మంలో టీఎన్జీవోస్ జిల్లా అసోసియేషన్ అధ్య క్షుడు మాధవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వాణి, జాయింట్ సెక్రటరీ గాయత్రి, సభ్యులు ఏ మహేందర్, గౌస్, భిక్షపతి, శివకుమార్, శ్రీకాంత్, మల్లేశ్, భాషయ్య, వెంకటేశ్, వెంక టిడ్డి, మహేశ్ గౌడ్, శంకర్, రాజు, శ్రీదర్ పాల్గొన్నారు.

## పార్టీకి నమ్మకమైన కార్యకర్త ఉండటం వలనే ఈ జన ప్రభంజనం..

**ఎమ్మెల్యే అమిలినేని ఎమ్మెల్యేగా సురేంద్ర బాబు రావడం మా అదృష్టం..**

**జోనల్ ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి**

ఘనంగా ముగిసిన మొదటి రోజు మహానాడు తెలుగుదేశం పార్టీకి అత్యంత కీలకమైన పసుపు సోదరులకు ప్రతిష్టాత్మకమైన పండుగ మహానాడుకు ఈ సారి వర్షంలో విధానములో అతి కూడా కష్టరలో నిర్వహించడం గొప్ప విశేషం..ఇలాంటి గొప్ప వర్షంలో మహానాడుకు అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామంలో జరిగిన వేడుకకు ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ జోనల్ ఇంచార్జ్ రెడ్డప్ప గారి శ్రీనివాస రెడ్డి, పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, క్లస్టర్ నాగరాజులతో కలసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నేటి సాయంత్రం పాల్గొన్నారు..ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి గారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతానికి ఎమ్మెల్యేగా సురేంద్ర బాబు రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు..కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ పథకం ద్వారా బీటీపీ పథకానికి నిధులు కేటాయించారని, బీటీపీ కాలువలు పూర్తి చేసి మా ఎమ్మెల్యే చేతుల మీదుగానే కృష్ణా జలాలు తీసుకువస్తారన్నారు..ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న ఒక్క అభివృద్ధి కూడా చేయలేని జగన్ మాటలను ఇక నమ్మకూడదని, మరో పదిహేను ఏళ్లపాటు టీడీపీ ప్రభుత్వం, ఇక్కడ ఎమ్మెల్యే అమిలినేని నిర్మాణ రంగంలో అపార అనుభవం కలిగిన వారని అలాంటి వారు ఎమ్మెల్యేగా ఉంటే తప్పకుండా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు..44 వసంతాల టీడీపీ పార్టీకి 30 ఏళ్ళు చంద్రబాబు నాయుడు గారు అధ్యక్షుడిగా, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారని నేడు మూడవ తరం నాయకుడు నారా లోకేష్ గారు ఆ బాధ్యతలు చేపట్టారని మరింత ఉత్సాహం కార్యకర్తల్లో వచ్చిందన్నారు..ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ ఎప్పుడు ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేయాలని మా ముఖ్యమంత్రి గారు దిశా నిర్దేశం చేస్తుంటారని, ఎలాంటి తప్పు చేసిన వెంటనే చెప్పి తిరిగి పొరపాట్లు జరగకుండా చూస్తారని అన్నారు, మాజీ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఒక్క రోజు కూడా అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం ఆమె సంపాదన, అక్రమార్జన, దోచుకోవడానికే పదేళ్ళ సరిపోయిందన్నారు.. మా యువ నాయకుడు ప్రస్తుతం దేశంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుడు నారా లోకేష్ గారు చెప్పిందే చేస్తారు, చేసేదే చెబుతారని, తిమ్మసముద్రంలో పెద్ద పరిశ్రమలు రాబోతున్నాయని, కన్నెపల్లి బ్రిడ్జి 14 నుంచి 16 నెలల్లో పూర్తి చేసి అగ్రహార ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తామని, ఇంకొకటి వేపులపర్తి గుమ్మగట్ట బ్రిడ్జి ఏర్పాటు కోసం రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, పార్లమెంట్ అధ్యక్షుడు పూల నాగరాజు సహకారంతో బ్రిడ్జి మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు..రేపటి రోజున తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ గారి జయంతి వేడుకలను మరింత వైభవంగా నిర్వహించి ఆయనకు ఘన నివాళులు అర్పిద్దామని తెలిపారు..

## మంత్రి పొంగులేటి దిష్టి బొమ్మ దగ్ధం

**హైదరాబాద్ :** బిసి సామాజిక వర్గానికి చెందిన మంత్రి వాకిటి శ్రీహరిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దురుసుగా ప్రవర్తించడాని బిసి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బషీర్ బాగ్ చౌరస్తా లో మంత్రి శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ , ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ మాట్లాడుతూ... క్యాబినెట్ మీటింగ్ అనంతరం సెక్రెటేరియట్ లో జరిగిన సమావేశంలో మంత్రి వాకిటి ఇచ్చిన పేపర్లను పొంగులేటి దురుసుగా అతనిపై పడేసి అవమానించారని అన్నారు. బిసిల పట్ల మంత్రి పొంగులేటి వైఖరి సరికాదన్నారు. గతంలో కూడా వినిసి చీఫ్ పై అసత్య ప్రచారాలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో బిసి నాయకుల పట్ల ఇలాంటి అవమానకర ఘటనలు జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే పొంగులేటి మంత్రి వాకిటి శ్రీహరికి క్షమాపణలు చెప్పాలని... లేనిపక్షంలో ఆయన ఇంటిని ముట్టడిస్తామని నీల వెంకటేష్ హెచ్చరించారు.

## బోయిన్పల్లి మార్కెట్ - అంబేద్కర్ నగర్ రహదారిలో ట్రాఫిక్ సమస్యపై ఎమ్మెల్యే శ్రీగణేష్ తక్షణ చర్యలు

బోయిన్పల్లి మార్కెట్ నుండి అంబేద్కర్ నగర్ రోడ్లో కూరగాయల దుకాణాలతో రోజూ ట్రాఫిక్ స్తంభించిపోయి అత్యవసర సమయంలో అంబులెన్స్లు కూడా బస్తీలోకి వెళ్లలేని దుస్థితి నెలకొందని బస్తీ వాసులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం ట్రాఫిక్, లా & ఆర్డర్ పోలీస్ అధికారులతో కలిసి స్పాట్కి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బస్తీ వాసులు, దుకాణదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుకాణదారులకు దుకాణాలన్నీ క్రమ పద్ధతిలోనే పెట్టుకోవాలని,రహదారిపై ట్రాఫిక్కు ఏమాత్రం అడ్డు పడొద్దని సూచించారు.అదేవిధంగా పోలీస్ అధికారులకు ఈ రోడ్లో వెంటనే అదనపు కెమెరాలు ఏర్పాటు చేయాలని, దుకాణదారులకు, బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.ప్రజల ప్రాణాల కంటే ఏదీ ఎక్కువ కాదని, అంబులెన్స్లు నిరాటంకంగా వెళ్లేలా చూడటం తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐలు తిరుపతి రాజు, శ్రీధర్ నాయక్, బస్తీ వాసులు, దుకాణదారులు పాల్గొన్నారు.